క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయనగర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 17న విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భీమ లింగప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆంజనేయనగర్‌, జనతానగర్‌, మూసాపేట, ఇంద్రానగర్‌, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు హబీబ్‌నగర్‌, పవర్‌ నగర్‌ పార్కు, ప్రగతినగర్‌, వసుంధర ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆపరేషన్‌ కగార్‌ను వెంటనే నిలిపేయాలి



ధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: ఆపరేషన్‌ కగార్‌ను కేంద్రం ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఈనెల 17న (నేడు) ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ధర్నా పోస్టర్‌ను హెచ్‌ఎంటీ హిల్స్‌ వద్ద సోమవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్‌, నాయకులు శివప్రసాద్‌, కృష్ణ నాయక్‌, ధర్మారావు మాట్లాడుతూ.. ఆపరేషన్‌ కగార్‌ పేరిట గత 17 నెలల్లో సుమారు 540 మందిని చంపివేశారని వీరిలో ఎక్కువగా ఆదివాసులు ఉన్నారన్నారు. మోదీ ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌ చేస్తూ ధర్నా చేపట్టామని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రాంనరేశ్‌నగర్‌లో సీవరేజ్‌ లైన్‌ పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: రామ్‌నరేశ్‌ నగర్‌కాలనీ 5వ లైన్‌లో సీవరేజ్‌ లైన్‌ పనులను హైదర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు, కాలనీ అసోసియేషన్‌ సభ్యులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ సిబ్బంది, కాలనీవాసులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశలవారీగా డివిజన్‌ను అన్ని రంగాల్లో చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ సూపర్‌వైజర్‌ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు, ప్రిన్సిపాల్‌

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ప్రిన్సిపాల్‌ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ప్రతిభ గల అధ్యాపకులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగానికి తోడ్పాటునందిస్తా



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న బాలానగర్‌ సీఐ

బాలానగర్‌: విద్యారంగానికి తోడ్పాటునందిస్తానని ప్రముఖ వ్యాపారవేత్త ప్రమోద్‌మోదీ అన్నారు. చరబండ రాజు కాలనీలోని ప్రభుత్వ జడ్పీ పాఠశాలకు బాలానగర్‌ సీఐ టి. నరసింహరాజు సూచన మేరకు ప్రమోద్‌ మోదీ కుమారుడు జ్ఞాపకార్థం 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బాలానగర్‌ సీఐ ముఖ్య అతిథిగా హాజరై సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ్‌ జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మోతీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలు





ఫుట్‌పాట్లు..!

- ఇటు ఆక్రమణలు.. అటు నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం
- రోజుల తరబడి తరలించని వైనం
- పాదచారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

మోతీనగర్‌: పాదచారుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. మూసాపేట, అల్లాపూర్‌ డివిజన్లలోని పలు బస్తీల్లో ఫుట్‌పాత్‌లపై ఓ వైపు వ్యాపారుల డబ్బాల ఏర్పాటు మరోవైపు నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తుండడంతో పాదచారులకు నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్‌, బీఎస్‌పీ కాలనీ, పాండురంగానగర్‌, అవంతీనగర్‌, స్నేహపురికాలనీలతో పాటు పలు బస్తీ కార్యాలయాలు అలాగే అల్లాపూర్‌ డివిజన్‌లోని గాయత్రీనగర్‌, వివేకానందనగర్‌, శ్రీ తులసీనగర్‌, పర్వత్‌నగర్‌, రాణాప్రతాప్‌నగర్‌, శివాజీనగర్‌, ఆర్‌కే సొసైటీ, న్యూ రామరావునగర గణేశ్‌నగర్‌తో పాటు పలు బస్తీలు, కాలనీల్లోని ఇళ్ల మధ్య ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. ఇదిలాఉంటే నెలల తరబడి చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలు ఫుట్‌పాత్‌లపైనే ఉంటున్నాయి. వీటిని చూసిన సమీప నివాసితులు కూడా తమ ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని ఇక్కడే పడవేస్తున్నారు. మరోవైపు విద్యుత్‌ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉంటున్నాయని తొలగించినవి కూడా ఇక్కడే పడేస్తున్నారు. అసలే వర్షాకాలం ప్రారంభం కావడంతో నెలల తరబడి చెత్తాచెదారం ఉంటుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలతో పాటు చెత్తాచెదారాన్ని, వ్యర్థాలను తొలగించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.



పాండురంగానగర్‌ పార్కు ఎదుట ఫుట్‌పాత్‌..





పీఎస్‌పీ కాలనీకి వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, గాయత్రీనగర్‌ ప్రధాన రోడ్డులో డబ్బాలు..

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధి దత్తాత్రేయ కాలనీలోని సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌ హాజరై హారతి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అందించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్‌, పీఎల్‌ ప్రసాద్‌, పోశెట్టి గౌడ్‌, నగేశ్‌ గౌడ్‌, జగదీశ్‌, మధుసూదన్‌ రెడ్డి, నిరంజన్‌ గౌడ్‌, శంకర్‌ గౌడ్‌, అశోక్‌, సత్యనారాయణ, మంజుల, నాగమణి, ప్రసన్న, లక్ష్మి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాపానాశేశ్వర ఆలయంలో పూజలు

మూసాపేట: మూసాపేట ఐడీఎల్‌ రంగధాముని చెరువు రోడ్డులోని పాప నాశేశ్వర ఆలయంలో సోమవారం రుద్ర చండీ హోమం నిర్వహించారు. టీపీసీసీ వైస్‌ ప్రెసిడెంట్‌, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్‌, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొని రుద్రాభిషేకం, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీ బ్లాక్‌ అధ్యక్షుడు తూము వేణు, ఏ బ్లాక్‌ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ పుష్పారెడ్డి, సప్పిడి ఆస్కార్‌, తూము సంతోష్‌, ఎండీ మొయిజ్‌, సతీశ్‌ గౌడ్‌, కృష్ణరాజ్‌పుత్‌, ఎండీ చున్ను పాషా, తూము కొండల్‌, తూము సచిన్‌, జోజమ్మ, భారతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు సప్పిడి దర్శన్‌, విశ్వనాథ్‌, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి

గచ్చిబౌలి: వాటర్‌ లాగింగ్‌ పాయింట్ల వద్ద వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ వాసుదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెస్ట్‌ జోనల్‌ కార్యాలయంలో హైడ్రా, ఇంజనీరింగ్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హైడ్రా బృందాలతో ఇంజనీరింగ్‌ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శంకర్‌, ఉప కమిషనర్లు, ఈఈలు, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 15 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ అధ్యక్షతన సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15 వినతి పత్రాలు అందించారు. ఇందులో టౌన్‌ ప్లానింగ్‌ 6, ఇంజినీరింగ్‌ 5, డిడి పార్క్‌స్‌పై 2, ఎలక్ట్రికల్‌ 1, అడ్మినిస్ట్రేషన్‌ 1, ఇతరత్రా సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్‌ కమిషనర్‌ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక

కూకట్‌పల్లి: టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్‌ ఇన్‌చార్జి బండి రమేశ్‌ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌ బాబును ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగా తన నియామకానికి మద్దతు ప్రకటించినందుకు శ్రీధర్‌ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రమేశ్‌ను అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాలని సూచించారు.



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌తో టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌

టీపీసీసీ ఉపాధ్యక్షుడిని..

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బండి రమేశ్‌ను కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు కూన సత్యం గౌడ్‌, మహిళా అధ్యక్షురాలు శిరీష సత్తూర్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, గాయత్రి, పద్మ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని..

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శేరిలింగంపల్లి కాంగ్రెస్‌ ఇన్‌చార్జి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు జగదీశ్వర్‌గౌడ్‌ను ఆయన నివాసంలో వైస్‌ ప్రెసిడెంట్‌ కూన సత్యం గౌడ్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శిరీష సత్తూర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరి శ్రీనివాస్‌ గౌడ్‌, పద్మ, గాయత్రి, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణ తొలగింపు



తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



ఫుట్‌పాత్‌పై నిర్మించిన గది

సాక్షి ఎఫెక్ట్‌..

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ బాలాజీ స్వర్ణపురికాలనీ పార్కు సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ స్కూల్‌ నిర్వాహకుడు అక్రమంగా గదిని నిర్మించి స్కూల్‌ పనులకు వాడుకుంటున్నాడు. ఈ విషయమై 'ఫుట్‌పాత్‌ ఆక్రమించి గది నిర్మించి' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితం అయ్యింది. దీంతో మూసాపేట సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు స్పందించి సోమవారం గదిని తొలగించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్‌ పనులు పూర్తి చేస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ వెంకటేశ్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లోని పెండింగ్‌ పనులు పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేశ్‌ గౌడ్‌, ఇంజినీరింగ్‌, జలమండలి విభాగం అధికారులతో కలిసి ఇంద్రానగర్‌, సాయిచరణ్‌ కాలనీల్లో సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్‌ మాట్లాడుతూ.. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి లేదా కార్పొరేటర్‌ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ఏఈ శ్రావణి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, జలమండలి వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు, ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ, నాయక్‌, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెడుతున్న కాంగ్రెస్‌'

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌పై కాంగ్రెస్‌ ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నదని, కానీ ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఫార్ములా ఈ- కార్‌ రేస్‌ కేసులో కేటీఆర్‌ ఏసీబీ విచారణ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులతో కలిసి సోమవారం తరలివెళ్లి ముందుగా తెలంగాణ భవన్‌కు చేరుకుని, అనంతరం ఏసీబీ కార్యాలయం వద్ద కేటీఆర్‌కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బీఆర్‌ఎస్‌ హయాంలోనే హైదరాబాద్‌ ఎంతో అభివృద్ధి చెందిందని, నగర ప్రజలందరూ మళ్లీ కేసీఆర్‌ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు.



తెలంగాణ భవన్‌ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, నాయకులు

ఓల్డ్‌ బోయినపల్లి నుంచి..

ఓల్డ్‌బోయినపల్లి: కేటీఆర్‌ ఏసీబీ విచారణ సందర్భంగా ఓల్డ్‌ బోయినపల్లి నుంచి కార్పొరేటర్‌ ముద్దం నరసింహాయాదవ్‌, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తరలి వెళ్లి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్‌, మేకల హరినాథ్‌, బాలరాజు, మక్కల సత్యనారాయణ, నగేశ్‌, కృష్ణారెడ్డి, పిట్ల రాజు, పోచయ్య, ఖదీర్‌, బుర్రి యాదగిరి, శ్రీనివాసరెడ్డి, లలితా తదితరులు పాల్గొన్నారు.



తరలి వెళ్లిన కార్పొరేటర్‌ నరసింహాయాదవ్‌, శ్రేణులు

నేడు అల్లాపూర్‌ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌లో ఈనెల 17న (నేడు) కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్‌ శ్రేణులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సఫ్దర్‌నగర్‌లో హిందూ శ్మశాన వాటిక, కాముని చెరువు, రాజీవ్‌గాంధీనగర్‌ బస్తీ దవాఖాన, సున్నం చెరువు పరిశీలన, అనంతరం అల్లాపూర్‌ వార్డు కార్యాలయంలో రివ్యూ సమావేశంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు.

ఫిట్‌నెస్‌ లేని 6 స్కూల్‌ బస్సుల సీజ్‌

కేపీహెచ్‌బీకాలనీ: ఫిట్‌నెస్‌ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 6 స్కూల్‌ బస్సులను కూకట్‌పల్లి రోడ్డు రవాణా ప్రాంతీయ కార్యాలయ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనుబాబు ఆధ్వర్యంలో సోమవారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి అన్నిపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



సీజ్‌ చేసిన బస్సులతో కూకట్‌పల్లి ఆర్టీఓ అధికారులు

వైభవంగా వార్షిక మహోత్సవ పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్‌-2లోని వీరాంజనేయ స్వామి, నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానం 39వ వార్షిక మహోత్సవ పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ధర్మాధికారి జై శంకర్‌ బాలగోపాల్‌, దేవస్థానం ఫౌండర్‌, ట్రస్టీ కుడిపూడి సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం చైర్మన్‌ జి. శ్రీదేవి, సత్యనారాయణ మూర్తి తెలిపారు. అలాగే ఈనెల 17న సాయంత్రం 7 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బీజేపీ కాంటెస్టెడ్‌ కార్పొరేటర్‌ ఎనుగుల తిరుపతి సోమవారం సందర్శించారు. ఇరుకు గదుల్లో వైద్యం, రోగుల ఇబ్బందులను పరిశీలించి డాక్టర్‌తో మాట్లాడారు. అనంతరం కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను కలిశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితిని వివరించి హస్మత్‌పేటలో కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మోడల్‌ మార్కెట్‌ భవనాన్ని ఆసుపత్రికి కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం డివిజన్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. డివిజన్‌ నుంచి జీహెచ్‌ఎంసీకి ఏడాదికి పన్నుల రూపంలో రూ. 25 కోట్లు వెళ్తున్న అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మోడల్‌ మార్కెట్‌ భవనంలోకి మార్చేందుకు ఎంపీ ఈటల రాజేందర్‌ గతంలో కలెక్టర్‌కు లేఖ పంపించారని, ప్రస్తుతం జోనల్‌, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లగా 10 రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మణి, రమేష్‌, మక్కాల నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నాయకుడు తిరుపతి

వాణిజ్య నష్టాలు తగ్గించి ఆదాయం పెంపుపై దృష్టి



పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చీఫ్‌ మేనేజర్‌ రాజా రమేశ్‌ను సత్కరించిన 'ఎస్కీ' డైరెక్టర్‌ రామేశ్వరరావు

రాయదుర్గం: విద్యుత్‌ సరఫరాలో నాణ్యతను పెంచి ప్రజల్లో విశ్వసనీయతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చీఫ్‌ మేనేజర్‌ హెచ్‌ఆర్‌డీ బెండపూడి రాజారమేష్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాలో పవర్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ సహకారంతో కేంద్ర విద్యుత్‌శాఖ నిర్వహించే రీ వ్యాంప్డ్‌ డిస్ట్రిబ్యూషన్‌ సెక్టార్‌ స్కీమ్‌ (ఆర్‌డీఎస్‌ఎస్‌) కింద నిర్వహించే కార్యక్రమంలో దేశంలో వివిధ రాష్ట్రాల డిస్కంలలో పనిచేసే 2,500 మంది ఇంజనీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాణిజ్య నష్టాలు తగ్గించి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్‌ డా.రామేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచడం వలన అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పవర్‌ అండ్‌ ఎనర్జీ హెడ్‌ విద్యాసాగర్‌ మాట్లాడారు. కార్యక్రమంలో లడఖ్‌ పవర్‌ డెవలప్‌మెంట్‌, గోవా డిస్ట్రిబ్యూషన్‌ కంపెనీ, జమ్మూ డిస్ట్రిబ్యూషన్‌కంపెనీ, తమిళనాడు, తిరుపతి, ముంబాయి, హర్యానా విద్యుత్‌ శాఖల ఇంజనీర్లకు శిక్షణ ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎస్కీ పవర్‌ అండ్‌ ఎనర్జీ విభాగం అధికారులు డాక్టర్‌ విద్యాసాగర్‌, శ్రీకాంత్‌, సరస్వతి ,అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.